ప్రజాశక్తి
బుధవారం 11 జనవరి 2023 5
పార్వతీపురం మన్యం



కూనేరులో గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఆపాలి

ప్రజాశక్తి-కొమరాడ

గుంటూరు నుంచి రాయగడ వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలును కూనేరు స్టేషన్లో నిలుపుదల చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్టేషన్ మాస్టర్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ జనవరి 10న నిలుపుదల చేస్తామని రైల్వే శాఖ అధికారులు హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. వెంటనే కూనేరు స్టేషన్‌లో గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మరడాన కృష్ణమూర్తి నాయుడు, కోటి మురళి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు ఎం.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రైతన్న భూములకు జగనన్న రంగు

- పట్టాదారు పాస్ పుస్తకాలపై వైసిపి హంగులు
- జగనన్న పేరిట భూహక్కు పత్రాలు
- పుస్తకంపై జగన్ ఫొటోలు
- ఆపై నవరత్నాల ప్రచార లోగో
- విస్తుపోతున్న ప్రజానీకం

సొమ్ము ఒకరిది..సోకొకరిది అన్నట్లు ఉంది భూ హక్కుపత్రాల జారీలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు. తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములకు, కష్టపడి కొనుగోలు చేసుకున్న భూములకు సంబంధించిన పత్రాలపై సిఎం జగన్మోహన్‌రెడ్డి పేరుపెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. పేరు ఒక్కటే కాదు సుమా...! ముందు, వెనుక పేజీల్లో వైసిపి జెండా రంగులతో కూడిన హంగులు, ఆయా పేజీల్లోనూ పెట్టిన రెండు సిఎం జగన్ ఫొటోలు, నవ రత్నాల లోగోలు హాస్యాస్పదంగా మారాయి. రైతుల వ్యక్తిగత ఆస్తిహక్కుపై సిఎం ఫొటోలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర భూ సర్వే పేరిట రీసర్వే చేస్తున్న విషయం విధితమే. ఇందుకు తగినంత సిబ్బందిని నియమించకపోవడంతో నత్తనడకన సాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో బొండపల్లి మండలం తమటాడ రెవెన్యూ గ్రామంలో సమగ్ర భూ సర్వేను సుమారు ఏడాది క్రితం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇప్పటికే ఈ గ్రామంలో సర్వే పూర్తయినట్టు ప్రభుత్వం ప్రకటించింది. పది రోజుల క్రితం జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. ఈనేపథ్యంలో ఈ గ్రామాన్ని ప్రజాశక్తి బృందం సందర్శించి, రీ సర్వే జరిగిన తీరుతెన్నులు, ప్రభుత్వ, ప్రైవేటు భూములు, పాసు పుస్తకాల జారీ తదితర అంశాలపై ఆరా తీసింది.

తమటాడ రెవెన్యూ గ్రామం 466.30ఎకరాల పరిధిలో విస్తరించి ఉంది. గ్రామంలో మొత్తం 160కుటుంబాలు ఉన్నాయి. 360 భూ ఖాతాదారులు ఉన్నారు. వీరిలో కేవలం 18మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారు. మిగిలిన ఖాతాదారులకు ఇతర రెవెన్యూ గ్రామాల పరిధిలో కూడా ఖాతాలు ఉండడం, తదితర సాంకేతిక కారణాల వల్ల ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. భూముల వివరాలు ఇంకా ఆన్‌లైన్ కాలేదు. 1బిలు రావడం లేదు. కానీ, ఈ గ్రామంలో సర్వే పూర్తిచేసినట్టు అధికారులు చెప్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, 1బి సమస్య వల్ల 'రీ సర్వే వల్ల కొత్త పాసుపస్తుకాలు తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదు' అంటూ పలువురు రైతులు చెప్పారు. సర్వే, సరిహద్దుల సంగతి కాస్త పక్కనబెడితే పాస్ పుస్తకాల్లో వైసిపి జెండా రంగులను పులిమారని, ఇది ఏమాత్రం సరికాదని కొందరు రైతులు అన్నారు. ఇప్పటి వరకు జారీచేసిన పాస్ పుస్తకాల్లో ఎక్కడా ముఖ్యమంత్రుల ఫొటోలు లేవని, ఈసారి రెండు పేజీల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోలు ముద్రించారని, రైతుల సొంత ఆస్తులకు హక్కులు కల్పించే క్రమంలో ఇటువంటి ప్రచార్భాటాలు తగవంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం జారీచేసిన పాస్‌పుస్తకాలపై జాతీయ జెండా చిహ్నంగా ఉండేదని, దాన్ని ఇలా దిగజార్చడం తగదని, ఇలా అయితే ముఖ్యమంత్రులు మారినప్పుడల్లా పాస్‌పుస్తకాలు మార్చు చేయాల్సివస్తుందని, దాని వల్ల సమయం, ప్రజాధనం దుర్వినియోగమౌతుందని అన్నారు.

రీ సర్వేలో భాగంగా గ్రామానికి వచ్చిన అధికారులు రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు ఆధారంగా భూమిని గుర్తించి, లింకులతో కొలిచినట్టుగా రైతులు చెప్పారు. భూ కమతాల సరిహద్దు రైతుల అభిప్రాయాలను కూడా తీసుకున్నారు. రైతుల భూముల మధ్య రికార్డు పరంగా వ్యత్యాసం లేకపోయినప్పటికీ సాగు భూముల మధ్య హెచ్చుతగ్గులు కనిపించాయి. రికార్డులో సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నప్పటికీ సాగు భూమి ఎక్కువగా ఉంది. ఈ మేరకు కొన్ని చోట్ల రస్తాలు, చెరువులు ఆక్రమణలకు గురైనట్టు తేలింది. గ్రామానికి సమీపంలోవున్న కొండ ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. ఈ భూమిపై సాగు హక్కు కల్పించడం లేదా అనర్హత పేరుతో తొలగించడం వంటివి అధికారులు చేయలేదు. కేవలం రికార్డుల టాలీ వరకే అధికారులు పరిమితమయ్యారు. ఇదే విషయమై బొండపల్లి తహశీల్దార్ శ్రీనివాస మిశ్రాను వివరణ కోరగా ఆక్రమణకు గురైన స్థలాలను ఏం చేయాలనేదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని, ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతానికి సరిహద్దుల్లో రాళ్లు పాతామని స్పష్టం చేశారు. రీ సర్వేలో ఆక్రమిత భూములు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలూ లేనప్పుడు ఇంత హంగామా ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జిఒ 1ను రద్దు చేయాల్సిందే

- వామపక్షాలు, ప్రజా సంఘాల డిమాండ్
- పలు చోట్ల నిరసనలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన జిఒ 1ని రద్దు చేయాల్సిందేనని వామపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. జిఒ 1ని రద్దు చేయాలని జిల్లాలో పలుచోట్ల మంగళవారం నిరసనలు చేపట్టాయి. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పి.రమణి, బి.నర్సింగరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పి.శ్రీను నాయుడు, ఎం.భాస్కర రావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, ఎం.గౌరి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, సిఐటియు జిల్లా ట్రెజరర్ గొర్లి వెంకటరమణ మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసికొచ్చిన ఒకటో నంబరు జిఒ ప్రజాస్వామ్య హక్కులను, భావ ప్రకటనా స్వేచ్చను హరించేలా ఉందన్నారు. రోడ్లు, వీధుల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని జిఒ తేవడం దారుణమన్నారు. అధికార వైసిపి చేస్తున్న ర్యాలీలు, సభలకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు అనుమతించి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. వామపక్షాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు రోడ్లు ఎక్కితే నిర్బంధిస్తామని, కేసులు కడతామని పోలీసులు హెచ్చరించడం సరైన పద్ధతి కాదన్నారు. రాజ్యాంగ హక్కుల కోసం పోరాడే శక్తులు, ప్రజాస్వామిక శక్తులు గొంతునొక్కడమేనని, ఇలాంటి జిఒని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ జిఒను రద్దు చేసే వరకూ దశల వారీగా పోరాటానికి పిలుపునిచ్చారు.

కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ ఆవిష్కరించారు. అనంతరం జిఒ 1ని రద్దు చేయాలని కోరుతూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు భానుమూర్తి, అప్పలనాయుడు, గౌరీ, శంకరరావు, సింహాచలం, సత్యరాజు, ఇప్పలమ్మ పాల్గొన్నారు..

సీతంపేట : సిఐటియు ఆలిండియా మహాసభను విజయవంతం చేయాలని సీతంపేటలో సిఐటియు మండల కార్యదర్శి కాంతారావు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిఒ 1 కాపీలను దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎస్.సురేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎ.దర్శిమి, బి.పార్వతి, పి.అంజలి, ఆశా యూనియన్ నాయకులు ఎస్.లక్ష్మి, ఎస్.మాలతి, ఎండిఎం యూనియన్ నాయకులు రొయబారి, బి.మీనా పాల్గొన్నారు.

కురుపాం : కురుపాంలో రావాడ జంక్షన్ వద్ద సిఐటియు మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు జి.ఈశ్వరరావు.. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. జిఒ 1ని రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సరళ కుమారి, కార్యదర్శి సరోజ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ, రూరల్ : పాలకొండ మండల కేంద్రంలో సిఐటియు జెండాను జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆవిష్కరించారు. అనంతరం సభలు, ర్యాలీలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబర్ ఒకటిని రద్దు చేయాలని నిరసన తెలియజేశారు. పాలకొండ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జిఒ 1 కాపీని సిఐటియు ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ కార్మికులపై నిర్బంధాన్ని వ్యతిరేకించాలని కోరారు. జిఒ 1 అమలుతో రాజ్యాంగబద్ధ హక్కులు శూన్యమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శి బి.అమరవేణి, కాద రాము, వివిధ సంఘాల నాయకులు ఎ.లక్ష్మణరావు, కె.గౌరీశ్వరి, కె.శారద, జి.జెస్సిభాయ్, బి.మాధవ్, సిహెచ్ సంజీవి, పడాల వేణు, కుప్పిలి శ్రీనివాసులు, బి. పట్టాభి పాల్గొన్నారు.

పాలకొండలో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మన్యం జాతర.. మనసుపెట్టి పనిచేయండి

- నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు
- శంబర జాతర ఏర్పాట్లపై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి-మక్కువ

మన్యం జిల్లాలో శంబర పోలమాంబ జాతర ప్రతిష్టాత్మకంగా జరిగేందుకు ప్రతి అధికారీ మనసుపెట్టి పనిచేయాలని ఆర్‌డిఒ కె.హేమలత ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జాతరకు ముందే చెప్పాలని, అలా కాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శ్రీముఖాలు ఇవ్వడం తప్పకపోవచ్చని హెచ్చరించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగే శంబర పోలమాంబ అమ్మవారి జాతరపై మంగళవారం శంబర గ్రామంలోని క్యూలైన్ సమీపంలో ఇఒ వి.రాధాకృష్ణ ఆధ్వర్యాన ఆర్‌డిఒ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లపై వివరాలడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి సుభాష్ మాట్లాడుతూ జాతర సమయంలో అన్ని శాఖలు పోలీస్ శాఖతో సమన్వయంగా కలిసి రావాలని కోరారు. వాహనాల పార్కింగ్‌కు ఈ ఏడాది ఇంకా వేలం నిర్వహించకపోవడం, స్థలాలను గుర్తించకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే జరిగే పనులు కావని, వెంటనే చర్యలు తీసుకుని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. దేవాదాయ శాఖ విచ్చలవిడిగా పాసులను కేటాయించడం పోలీసులకు తలనొప్పిగా మారిందన్నారు. పాసుల జారీలో ఈ ఏడాది కచ్చితంగా నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించేవారు, వివిధ కేసుల్లో నమోదైన వారిని ఈ ఏడాది సిరిమాను సేవలో పాల్గొనివ్వబోమని డిఎస్‌పి స్పష్టంచేశారు.

మక్కువ వంతెన వద్ద ఆర్‌అండ్‌బి రహదారి పూర్తి అధ్వానంగా ఉందని, దీనిని బాగు చేయకుంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని సాలూరు సిఐ.. ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్‌అండ్‌బి ఎఇ కమలాకర్ మాట్లాడుతూ నిధులు అనుకున్నంతగా లేవని, అయినా ఏదో విధంగా సరి చేస్తామని తెలిపారు.

సమీక్ష నిర్వహిస్తున్న ఆర్‌డిఒ హేమలత

పత్రికలో చదివాను.. అలా జరగొద్దు

'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆర్‌డిఒ హేమలత సమీక్షలో ప్రస్తావించారు. గతంలో జరిగిన పొరపాట్లపై దేవాదాయ శాఖ అధికారులకు ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఈసారి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

66 ఆర్‌టిసి బస్సులు

జాతర సందర్భంగా సాలూరు, పార్వతీపురం డిపోల నుంచి 66 ఆర్‌టిసి బస్సులను నడిపినట్లు డిపో మేనేజర్ తెలిపారు. రద్దీనిబట్టి ఈ బస్సుల సంఖ్యను పెంచే ఆస్కారం ఉందన్నారు. అద్దె చెల్లిస్తే పార్కింగ్ కోసం స్థల యజమానులతో మాట్లాడతామని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పేర్కొనగా, ఇప్పటివరకు ఏ జాతరలోనూ పార్కింగ్ స్థలాలకు అద్దె చెల్లించే అలవాటు ఆర్‌టిసికి లేదని మేనేజర్ వెల్లడించారు.

సమావేశంలో దేవాదాయశాఖ అధికారి సుధారాణి, ఎంపిడిఒ దేవకుమార్, తహశీల్దార్ సూర్యనారాయణ, మక్కువ ఎస్ఐ పైడిరాజు, సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపిటిసి పోలినాయుడు, వివిధ శాఖల అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంగళరాయ సాగర్ కుడి ప్రధాన కాలువ పనులను కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. మక్కువ మండలం చెముడు గ్రామం వద్ద కాలువ లైనింగ్, సాలూరు మండలం లక్ష్మీపురం వద్ద హెడ్ వర్క్స్ పనులను పరిశీలించారు. ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా మక్కువ, సీతానగరం, బొబ్బిలి మండలాల పరిధిలోని సుమారు 16,150 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ వద్దనున్న ఆక్విడాక్ట్ ద్వారా ఎంత మేర సాగునీరు అందింది, ప్రస్తుత స్థితిగతులపై ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆరాతీశారు. సుమారు 2.05 కిలోమీటర్ల ఆక్విడాక్ట్‌తో ఆయా ఆయకట్టుకు సాఫీగా సాగునీటి సౌకర్యం ఉండేదని, ఆక్విడాక్ట్ మరమ్మతులకు గురి కావడంతో సాగునీటికి కొంతమేర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు, రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలువ లైనింగ్ పనులతోపాటు నూతన ఆక్విడాక్ట్ నిర్మాణం చేపట్టాలని, శివారు భూములకు కూడా సాగునీటి సౌలభ్యం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వెంగళరాయ సాగర్ రిజర్వాయర్ విస్తీర్ణం, నీటి సామర్థ్యం తదితర విషయాలను మ్యాప్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం హెడ్ సప్లైస్, స్పిల్ వే, గేట్లు, సైరన్ పనితీరును పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.అప్పలనాయుడు, డిఇ సురేష్, జెఇలు శ్రీనివాసు, జగదీష్, రాజశేఖర్, ప్రశాంత్, బి.తిరుపతి, ఆర్ఐ కె.స్వాతి, ఎఎస్ఐ బి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గర్భిణుల హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని వైటిసిలో గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని మంగళవారం డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ వినోద్ తనిఖీ చేశారు. వసతిగృహంలో ఉన్న గర్భిణులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సుఖ ప్రసవం, ఆరోగ్యవంతమైన ఆహారం గురించి సూచనలు చేశారు. నిర్వాహకులు, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావుతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఏరియా ఆసుపత్రి నుంచి సరిపడా మందులు అందడం లేదని డైరెక్టర్ తెలిపారు. దీనికి వినోద్ సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట శంబర పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రఘు ఉన్నారు.



విజయమౌళిని సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్ గణేశ్వరరావు, తదితరులు

జాతీయ వెయిట్ లిఫ్టర్‌కి సన్మానం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణానికి చెందిన యువకుడు, శ్రీవెంకట విద్యాగిరి పాఠశాల పూర్వ విద్యార్థి బర్లి విజయమౌళిని ప్రాణదాత ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వి.గణేశ్వరరావు మంగళవారం సన్మానించారు. విజయమౌళి ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. సామాన్య కుటుంబానికి చెందిన విజయమౌళి జాతీయ స్థాయిలో రాణించడంతో సన్మానించారు. కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభకి పేదరికం అడ్డు కాదని విజయమౌళి నిరూపించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రామకృష్ణ పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో తొమ్మిది గ్రామ వాలంటీర్ పోస్టులకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 9 పోస్టులకు గాను 12 మంది దరఖాస్తు చేసుకోగా 11 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో సూపరింటెంట్ మాస, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనమివ్వాలని అంగన్వాడీల ధర్నాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కనీస వేతనాలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని తదితర డిమాండ్లపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు ధర్నాలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వం తీసుకువచ్చిన పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యత పెంచాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్‌చేశారు. అంగన్వాడీలకు సెంటర్లకు పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఆర్ఐకి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టి.ప్రభావతి, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు సిఎం జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులు మానుకోవాలని డిమాండ్‌చేశారు. బయోమెట్రిక్ సమస్య వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.పార్వతి, రవణమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శివన్నారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ధర్మవతి, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్‌చేశారు. జిఒ 1ని రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీలకు సీనియారిటీ ప్రకారం వేతనం ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులు వయోపరిమితి తొలగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు కె.నీలవేణి, గౌరీ, సరస్వతి, సావిత్రి ,అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయొద్దని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జిఒ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీలు ధర్నాచేశారు. ముందుగా ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సిఐటియు జెండాను సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడు ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఫేస్‌యాప్ రద్దు చేయాలన్నారు. గ్రామ సచివాలయాలకు అప్పజెప్పాలన్న ఆలోచన విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాలమ్మ, ఇందిరా, సావిత్రి, స్వర్ణలత, పోలమ్మ, సునీత, లక్ష్మి, రూప, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.జ్యోతి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, శ్రామిక మహిళా నాయకురాలు వి.రామలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు సునీత, శైలజ, లక్ష్మి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట, సీతానగరంలో ధర్నాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు

పార్వతీపురంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

సాలూరులో అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌వైనాయుడు

పాచిపెంటలో వినతి అందిస్తున్న అంగన్వాడీలు

గుమ్మలక్ష్మీపురంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఐటిడిఎ పిఒ బి.నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, ఉగాది నాటికి పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఇంతవరకు బిల్లులు కాని వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇస్తామన్నారు. బిల్లులు విడుదలకు కూడా చర్యలు తీసుకొంటామన్నారు. స్లాబ్ లెవెల్, స్లాబ్ పూర్తి అయినా వారికి అవగాహన కల్పించి ఉగాది నాటికి గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, హౌసింగ్ ఎఇ వెంకటేష్, అసిస్టెంట్ సంతోష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలో ఇళ్ల నిర్మాణాలపై మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బొంగు సురేష్ సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేటట్లు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖాధికారులకు ఎంపిపి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, గృహ నిర్మాణ శాఖ డిఇ మోహన్‌రావు, ఎఇ ఎల్.ఉమా మహేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దిగువకలువరాయి వెలుగు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వెలుగు సంస్థ కార్యదర్శి బి సంజీవరావు మాట్లాడుతూ ప్రకృతి సాగుతో వచ్చే లాభాలను రైతులకు వివరించారు. జీడి పంటలో తెగుళ్లు, దాని నివారణకు చర్యలు తెలియజేశారు. టెక్నికల్ అసిస్టెంట్ దివాకర్ మాట్లాడుతూ కొబ్బరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాము, కోఆర్డినేటర్ పాలక శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-సాలూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి ముగ్గురు పేద మహిళలకు కుట్టు మిషన్లు, ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. క్లబ్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్, వేదసమాజం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అన్నం రాజు గుప్తా, కార్యదర్శి పి.గోపి, సభ్యులు ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధన పట్ల అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్, కేదారిపురం ఆశ్రమ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖరావు పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న సిఐ సత్యనారాయణ

రూ.2,27,740కు వాహనాల వేలం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం రెండు ఆటోలు, ఏడు ద్విచక్ర వాహనాలకు ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్ఇబి సూపరింటెండెంట్ సుదర్శన్‌రావు వేలం పాట నిర్వహించారు. ఈ తొమ్మిది వాహనాలు కలిపి 2,27,740 రూపాయలకు వేలం వేసినట్లు వారు తెలిపారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్యకైలాస్ పాఠశాల కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలోని పెదమేరంగి జంక్షన్‌లో శ్రీ సత్యకైలాస్ పాఠశాల కేలండర్‌ను మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవిష్కరించారు. 20 ఏళ్ల చరిత్ర గల సత్యకైలాస్ పాఠశాలలో మొదటిసారిగా కరస్పాండెంట్ రౌతు అజయ్ కుమార్ బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత కేలండర్లను ముద్రించారు. సామాజిక స్పృహ కలిగిలా విద్యను అందించడమే పాఠశాల ధ్యేయమని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని కరస్పాండెంట్ అన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-కొమరాడ

సచివాలయ ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎంపిడిఒ ఎల్వి అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని పరశురాంపురం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలించారు. అనంతరం సచివాలయంలో ఉన్న వివిధ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేసిన వారికి బిల్లులు సకాలంలో అందేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్ కృషి చేసి, ఎం-బుక్ నమోదు చేయాలన్నారు. సచివాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా మెలగాలని సూచించారు. దురుసుగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పైపులైన్లు సరిచేసిన ఎస్ఐ

ప్రజాశక్తి-సీతానగరం

స్వర్ణముఖి నది వంతెన పైన ఉన్న పైపులైను రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో వాటిని మంగళవారం సరిచేస్తున్నారు వాహనదాలకు అడ్డంగా ఉండటంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎస్సై స్పందిస్తూ వెంటనే ఎస్సై సిబ్బందితో కలిసి వాటిని సరి చేస్తున్నారు దీంతో ఆయనకు అందరూ అభినందనలు తెలిపారు.

పైపులైన్లను సరిచేస్తున్న ఎస్ఐ, కూలీలు

లక్ష్మింపేటలో సిఐ పర్యటన

వంగర : మండలంలోని లక్ష్మింపేటలో రాజాం రూరల్ సిఐ హెచ్. ఉపేంద్ర రావు మంగళవారం పర్యటించారు. సిఐగా ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన మొదటిసారిగా గ్రామంలో పర్యటించి పోలీస్ అవుట్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ప్రత్యేక కోర్టును పరిశీలించారు. అక్కడ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. చక్కగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వంగర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రైమ్ రికార్డులకు సంబంధించి ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాచిపెంట.. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. మంగళవారం మండలంలోని పాంచాలి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమల్లో ఏమైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిదులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లోవముఠా ప్రాంతంలో గడపగడపకు

గుమ్మలక్ష్మీపురం : గిరిజన ప్రాంత అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలం జర్న సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, వైస్ ఎంపిపి శేఖర్, లక్ష్మణ్, జెడ్‌పిటిసి రాధిక, సర్పంచుల సంఘం అధ్యక్షులు బి.గౌరీశంకర్ పాల్గొన్నారు.

పుబ్బాడలో..

సీతంపేట : మండలంలో పుబ్బాడ, పుబ్బాడగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల గురించి ఆమె ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, హౌసింగ్ ఎఇ వెంకటేష్, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

అగమ్యగోచరంగా యువత భవిష్యత్తు

కురుపాంలో యువశక్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి అధికారంలోకి వచ్చాక యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.మార్కండేయబాబు తెలిపారు. మంగళవారం కురుపాం కాంప్లెక్స్ వద్ద జనసేన నాయకులు నేరేడుబిల్లి వంశి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగే యువశక్తి సభకు యువత తరలి రావాలని కోరారు. అనంతరం యువశక్తి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు వాన ఉపేంద్ర, గార గౌరీ, కద్రక మల్లేసు, వి.శివ, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : యువశక్తి కార్యక్రమానికి యువత భారీ ఎత్తున తరలిరావాలని జనసేన నాయకులు పెద్దపూడి విజయ్ కుమార్, తాడి మోహన్ కుమార్, బోడపాటి శివదత్, తోట చంద్రశేఖర్ కోరారు. పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువశక్తి కార్యాచరణ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జనసైనికులకు, వీరమహిళలకు యువశక్తి ఐడి కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చెందక అనిల్‌కుమార్, రెడ్డి కరుణ, గొర్లి చంటి, వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు పాల్గొన్నారు..

గిరిజన సంక్షేమం పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

వైసిపి పాలనలో గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని తానవలస, పనసభద్ర గిరిజన గ్రామాలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి, వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్దే లక్ష్యమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి.. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారని అన్నారు. ఎస్‌టిలకు సంబంధించిన పథకాలలో కోత విధించడమే కాకుండా చాలా పథకాలను ఎత్తేశారని విమర్శించారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క గిరిజనుడికి ట్రైకార్ రుణాలను మంజూరు చేయలేదని చెప్పారు.

ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డి.మోహన్‌రావు, నాయకులు జి.వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, జాగానం ధనుంజయరావు, రవికుమార్, తాన తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం కర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిరంజీవులు

నూతన భవనాలతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

నూతన సచివాలయ భవనాలతో గ్రామీణులకు మెరుగైన సేవలు అందుతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎంఆర్ నగరంలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మెరుగైన సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అవినీతి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులు అందిస్తున్నామని చెప్పారు.

మూడున్నర ఏళ్లలో ఎమ్మార్ నగరం పంచాయతీలో మూడున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. భవిష్యత్తులో తాగునీటి కొరత లేకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజి, ఎంపిడిఒ అకిబ్ జావేద్, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు పూడి శంకరరావు, సిద్ధ జగన్నాథరావు, సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఉప సర్పంచ్ త్రినాథనాయుడు, ఎంపిటిసి బడే రామారావు, వైసిపి నాయకులు, భీమవరపు కృష్ణ, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, మజ్జి చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పోటీలను ప్రారంభిస్తున్న అంధవరపు కోటేశ్వరరావు దంపతులు

ప్రజాశక్తి - కురుపాం/జియ్యమ్మవలస

క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం దాసరిపేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా స్వామి వివేకానంద యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలతో యువతలో పోటీతత్వంతోపాటు స్నేహభావం పెరుగుతుందన్నారు. ఇక ముమ్ముందు కూడా ఇటువంటి టోర్నమెంట్లు పెట్టాలని యువతకు సూచించారు. తనవంతుగా రూ.20 వేలను టోర్నీ నిర్వాహకులకు అందజేశారు. కురుపాం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ రూ.5 వేలు, రెండు ఎల్ఇడి లైట్లు అందజేశారు. దాసరి పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొల్లపల్లి సత్యనారాయణ నాయుడు కుమారుడు రూ.40 వేల అందజేశారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన పెద్దలకు యువత కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో షటిల్ సీనియర్ ఆటగాళ్లు సిహెచ్ గోపి, బి.మురళి, నిర్వాహకులు శంకర్, బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కొమరాడ : యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్‌బాబు అన్నారు. కంభవలస పంచాయతీ కంచరపాడు గ్రామంలో యువత నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా యువతకు క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ అందించాలని సూచించారు.

'గాయత్రి'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని గాయత్రి స్కూల్లో కరస్పాండెంట్ పివికె మణికుమార్, సరిత దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, చిన్నారులతో కలిసి భోగి మంటలను వేశారు. సంక్రాంతి రంగుల హరివిల్లుల ముగ్గులను వేయించి, బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. గంగిరెద్దుల పూజలతో, గొబ్బెమ్మల ఆటలతో, హరిదాసు వేషధారణలతోపాటు సంప్రదాయ దుస్తులను ధరించి చిన్నారులు అలరించారు. సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు, కరస్పాండెంట్ దంపతులు, సిబ్బంది

మాట్లాడుతున్న ఎంఇఒ ఆనందరావు

క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని ఎంఇఒ ఆనందరావు అన్నారు. మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పిసి చైర్మన్ ఆరిక కళావతి ఆధ్వర్యాన నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెలవుల్లో ఇంటి వద్ద చదివేటట్లు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. సర్పంచ్ హెచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు, ఐద్వా, పిపిఎస్ఎస్ నాయకులు

తాగునీటి కోసం నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పండగలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా ఇవ్వాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఐద్వా ఆధ్వర్యాన 25వ వార్డు పరిధిలో బొగ్గులవీధి మహిళలు ఖాళీబిందెలతో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో కొన్ని నెలలుగా మూణ్నాలుగు రోజులకోసారి మాత్రమే కొళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. అది కూడా చాలీచాలని నీళ్లు ఇస్తున్నారని, దీనివల్ల ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పండగల నేపథ్యంలో పూర్తిస్థాయిలో నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు వాకాడ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

కొసరివానివలసలో తాగునీటికి ఇబ్బందులు

పార్వతీపురం రూరల్ : మండలంలోని గోచక్క పంచాయతీలో కొసరివానివలస, కొత్త కొసరివానివలసలో నీటి సరఫరా సక్రమంగా చేపట్టక పోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డి.శిర్లాం పైలెట్ ప్రాజెక్టు నుండి గ్రామానికి నీటి సరఫరా జరగాల్సి ఉంది. గత కొద్ది రోజులుగా సరఫరా కాకపోవడంతో తాగునీటి కోసం గ్రామంలో ఉన్న బోరుబావి ఆధారమైంది. ఇటీవల బోరు మరమ్మతులకు గురవడంతో గిరిజనులు గ్రామానికి దూరంగా ఉన్న గెడ్డ నీటిని తెచ్చుకొంటున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచికి తెలియజేసినా చర్యలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని పట్టు చెన్నూరు పంచాయతీ డొంకలవెలగవలస గ్రామంలో అనేక సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 60 గిరిజన కుటుంబాలు అన్‌సర్వే భూములను సాగు చేస్తూ జీవనం సాగు చేస్తున్నాయని చెప్పారు. వారికి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ రాయితీలు అందడం లేదన్నారు. ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ సీతారాం, గిరిజనులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

108 వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది, స్థానికులు

ఆటో, కారు ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మగదబవలస సెంటర్ వద్ద మంగళవారం సాయంత్రం ఆటో, కారు ఢీకొన్నాయి. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వంజరపుగూడ నుండి ఆటోతో గుమ్మలక్ష్మీపురం వెళ్తోంది. గుమ్మలక్ష్మీపురం నుండి కారుతో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలు పార్వతీపురం డిఇఒ కార్యాలయానికి శిక్షణ నిమిత్తం వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు గుమ్మగదబవలస సెంటర్‌లో ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పల్ల అదుర్స్, పల్ల వెంకటరమణ, వంజరాపు నితిన్, పల్ల విజయవర్ధన్ తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న పి.మాధవరావు, చంద్రమోహన్, పి.విజయవర్ధన్‌కు గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కొందరిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆటోడ్రైవర్‌కి తీవ్రమైన గాయాలు కావడంతో విశాఖ తరలించారు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు.

క్షతగాత్రులను పరామర్శించిన జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యాయామ ఉపాధ్యాయులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

సారా ధ్వంసం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గతేడాది ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో 25 కేసుల్లో పట్టుబడిన 714 లీటర్ల నాటుసారాను మండలంలోని జాతాపు కోటపాడు గ్రామ సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశంలో మంగళవారం ధ్వంసం చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెకానిక్‌షాపు దగ్ధం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట కూడలిలో బైక్ మెకానిక్ షాపు సోమవారం రాత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. అదే గ్రామానికి చెందిన యువకుడు మహేష్ ద్విచక్రవాహనాలు బాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. జీవనాధారమైన షాపు దగ్ధం కావడంతో యువకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.